SUN - M U_SAT - M U.qxd 25-12-2023 02:33 AM Page 1

మార్పు కోసం...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 185/ 25 సోమవారం, డిసెంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-

**విలేకరులు కావలెను**

హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
**మరో ఉదయం**
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842



## అధికారులపై ఎలాంటి వివక్ష ఉండదు...

- జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం
- ప్రజలతో మమేకం అవ్వాలని అధికారులకు సూచన
- నేతలకు ఐదేళ్లే... అధికారులకు 35 ఏళ్ల సర్వీసు ఉంటుందని వెల్లడి
- బాధ్యతతో మెలగాలని పిలుపు

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉన్నతాధికారులపై ఎలాంటి వివక్ష ఉండదని స్పష్టం చేశారు."మీరు వివిధ రాష్ట్రాల్లో పుట్టి పెరిగి, ఆలిండియా సర్వీసు పోటీ పరీక్షలు రాసి ఐఏఎస్ లు, ఐపీఎస్ లుగా సెలెక్ట్ అయ్యారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఎంచుకుని ఇక్కడికి వచ్చారు. ఒక బాధ్యత తీసుకుని రాష్ట్ర నిర్మాణంలో పాలుపంచుకోవడానికి మీరు ఇక్కడికి వచ్చారు. ఇక్కడి పౌరులతో మమేకం అయ్యారు. మాది వేరే రాష్ట్రం అనో, మా భాష వేరు అనో మీరెవరూ భావించాల్సిన పనిలేదు. మేమెవరం కూడా మిమ్మల్ని ఆ కోణంలో చూడడంలేదు, ఎలాంటి వివక్ష చూపించడంలేదు. మీరు స్థానిక ప్రజల భాష తెలుసుకోండి, ప్రజల మనసులు గెలవండి. రాజకీయనేతలకు ఐదేళ్లే కాలపరిమితి, మీకు 35 ఏళ్ల సర్వీసు ఉంటుంది. అన్ని సంవత్సరాల సర్వీసును మీకందిస్తున్నారంటే, మీరు ఎంత జవాబుదారీతనంతో వ్యవహరించాలో అర్థం చేసుకోండి. కొంతమంది అధికారులు బదిలీ అయి వెళ్లిపోతున్నప్పుడు ప్రజలు సన్మానం చేయడం చూస్తుంటాం... ఓ మంచి అధికారిని ప్రభుత్వం బదిలీ చేస్తోందని కన్నీరు పెట్టుకుంటారు. మీరు కూడా ప్రజల్లో నమ్మకం పొందేలా పనిచేయండి. మీరు తెలంగాణలో ఎక్కడికి వెళ్లినా బాధ్యతతో మెలగండి" అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.




## రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసు క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవ సోదరసోదరీమణులు పండుగలా ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని కేసీఆర్ అన్నారు. శాంతి సౌభ్రాతృత్వం కరుణ క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు.



## ఆ రాష్ట్రాల వాళ్లు తమిళనాడులో టాయిలెట్లు కడుగుతుంటారు: దయానిధి మారన్

- దయానిధి మారన్ వ్యాఖ్యలు వివాదాస్పదం
- యూపీ, బీహార్ నుంచి వచ్చేవాళ్లు తమిళనాడులో కార్మికులుగా ఉన్నారన్న మారన్
- భవన నిర్మాణ కార్మికులుగా, టాయిలెట్ క్లీనర్లుగా ఉన్నారని వ్యాఖ్యలు
- మండిపడిన బీజేపీ



ఉత్తర భారతదేశానికి, తమిళనాడుకు మధ్య సాంస్కృతిక వైరుధ్యాలు తీవ్రస్థాయిలో ఉంటాయని తెలిసిందే. ముఖ్యంగా భాషాపరమైన వివాదాలు ఎప్పటినుంచో ఉన్నాయి. హిందీని తమిళులు ఏమాత్రం అంగీకరించే పరిస్థితి లేదు! కాగా, డీఎంకే ఎంపీ దయానిధి మారన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ఆయన గతంలో చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియో ఇప్పుడు తెరపైకి వచ్చింది. యూపీ,

మిగతా 3 లో

## ఈ నెల 28 నుంచి ఆరు గ్యారెంటీల దరఖాస్తులు స్వీకరిస్తాం: పొంగులేటి

- ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు ప్రకటించిన కాంగ్రెస్
- ఎన్నికల్లో గెలిచి రేవంత్ రెడ్డి సీఎంగా ప్రభుత్వం ఏర్పాటు
- ఇప్పటికే రెండు గ్యారెంటీల అమలు


3 లో

## 10 ఉమ్మడి జిల్లాలకు ఇన్చార్జిల ప్రకటన

- కరీంనగర్ కు ఉత్తమ్ కుమార్... ఖమ్మం జిల్లాకు కోమటిరెడ్డి... జిల్లాలకు ఇన్చార్జి మంత్రుల నియామకం
- జిల్లాలకు ఇన్చార్జి మంత్రులను నియమించిన సీఎం రేవంత్ రెడ్డి
- 10 ఉమ్మడి జిల్లాలకు ఇన్చార్జిల ప్రకటన
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తాజాగా జిల్లాలకు ఇన్చార్జి మంత్రులను నియమించారు. 10 ఉమ్మడి జిల్లాలకు ఇన్చార్జి మంత్రులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నేడు ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ జిల్లాకు పొన్నం ప్రభాకర్, నిజామాబాద్ జిల్లాకు జూపల్లి కృష్ణారావు, కరీంనగర్ జిల్లాకు ఉత్తమ్ కుమార్ రెడ్డి, రంగారెడ్డి జిల్లాకు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఖమ్మం జిల్లాకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాకు దామోదర రాజనర్సింహ, నల్గొండ జిల్లాకు తుమ్మల నాగేశ్వరరావు, వరంగల్ జిల్లాకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లాకు సీతక్క, మెదక్ జిల్లాకు కొండా సురేఖను ఇన్చార్జిలుగా నియమించారు.

## చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

- మంగళగిరి టీడీపీ కార్యాలయంలో చేరికలు
- పెదకూరపాడు, తణుకు, అమలాపురం, గజపతినగరం వైసీపీ నేతలు టీడీపీలో చేరిక
- పసుపు కండువా కప్పి పార్టీలోకి స్వాగతించిన చంద్రబాబు
- సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు

తణుకు, పెదకూరపాడు, గజపతినగరం, అమలాపురం నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు ఇవాళ భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ అధినేత చంద్రబాబు పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇవాళ రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే ఆలోచన ఉన్నవారే టీడీపీలోకి వస్తున్నారని తెలిపారు. ఓటమి ఖాయమని జగన్ కు అర్థమైందని వ్యాఖ్యానించారు. ఇన్ని అరాచకాలు చేసిన వ్యక్తి సీఎంగా పనికిరారని అన్నారు. తాను 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశానని, 28 ఏళ్లుగా పార్టీ అధ్యక్షుడిగా ఉన్నానని, అందరి ఆశీస్సులతో రాష్ట్రానికి, తెలుగుజాతికి మంచి పేరు, గౌరవం తీసుకువచ్చానే తప్ప, ఎప్పుడూ అపఖ్యాతి తీసుకురాలేదని అన్నారు.



మిగతా 2 లో

## తెలంగాణ అప్పు రూ.3.17 లక్షల కోట్లే.. కేటీఆర్

- ప్రభుత్వం మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఫైర్
- శ్వేత పత్రానికి కౌంటర్ గా స్వేద పత్రం విడుదల
- బీఆర్ఎస్ పాలన దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని వ్యాఖ్య

తెలంగాణలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాలన దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పదేళ్ల ప్రగతిపై కాంగ్రెస్ ప్రభుత్వం బురద జల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రానికి కౌంటర్ గా తెలంగాణ భవన్ లో ఆదివారం 'స్వేద పత్రం' విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ అప్పు కేవలం రూ.3.17 లక్షల కోట్లేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రం అప్పులను ఎక్కువ చేసి చూపిస్తోందని ఆరోపించారు. తద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, తమను బదనాం చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానంపై తెలంగాణ భవన్ లో కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణను విఫల రాష్ట్రంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతాన్ని ఇదే కాంగ్రెస్ నేతలు విధ్వంసం చేశారని ఆరోపించారు. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపించిన బీఆర్ఎస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. శ్వేతపత్రాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రంలో పేర్కొన్న అప్పుల గురించి ప్రస్తావిస్తూ.. తెలంగాణ మొత్తం అప్పులు రూ.6,71,757 కోట్లని చెప్పడం పూర్తిగా అబద్ధమని కేటీఆర్ చెప్పారు.



## ప్రశాంత్ కిశోర్ ను 2019లోనే వాడేశాం!:

- నిన్న చంద్రబాబుతో ప్రశాంత్ కిశోర్ భేటీ
- చంద్రబాబు కాలం చెల్లిన రాజకీయ నేత అంటూ కొడాలి నాని వ్యాఖ్యలు
- ఒట్టిపోయిన గేదెలాంటి ప్రశాంత్ కిశోర్ ను వ్యూహకర్తగా పెట్టుకున్నాడని విమర్శలు
- ప్రశాంత్ కిశోర్ బుర్రలోని గుజ్జంతా తాము పీల్చేశామని వెల్లడి

టీడీపీ అధినేత చంద్రబాబును ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కలవడంపై వైసీపీ మాజీ మంత్రి కొడాలి నాని స్పందించారు. చంద్రబాబు, ప్రశాంత్ కిశోర్ 3 గంటల పాటు సమావేశమయ్యారని, ఇక భూమి బద్దలవుతుందని ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. చంద్రబాబు కాలం చెల్లిన రాజకీయనేత అని జగన్, తాము అనేకసార్లు చెప్పామని అన్నారు. ప్రశాంత్ కిశోర్ ను తాము 2019లోనే వాడేశామని తెలిపారు. అతని బుర్రలోని గుజ్జంతా అయిపోయిందని, ఒట్టిపోయిన గేదె లాంటి అతడ్ని తీసుకెళ్లి చంద్రబాబు

మిగతా 3 లో



మార్పు కోసం...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## కరోనా మళ్లీ డేంజర్ బెల్స్

కరోనా మళ్లీ డేంజర్ బెల్స్ మోగిస్తున్నది. గత 24 గంటల్లో దేశంలో రికార్డు స్థాయిలో 614 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మే 21 తర్వాత ఇంత అధిక స్థాయిలో కరోనా కేసులు నమోదు కావడం ఇదే ప్రథమం. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 2,311కు చేరినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొంది. కొవిడ్-19 ఉప రకం జేఎన్.1కు సంబంధించి మూడు రాష్ట్రాల్లో 21 కేసులు నమోదయ్యాయి. గోవాలో 19, మహారాష్ట్ర, కేరళలో ఒక్కొక్క కేసు నమోదయ్యాయి. ఈ ఉప వేరియంట్ వ్యాప్తికి గల కారణాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. గత 24 గంటల వ్యవధిలో కరోనా కారణంగా కేరళలో మూడు మరణాలు నమోదయ్యాయి. దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్న క్రమంలో ప్రజలంతా మళ్లీ అప్రమత్తంగా ఉండాలని కేంద్రం హెచ్చరిస్తోంది. కేంద్రం సూచనలతో రాష్ట్రాలు కూడా అప్రమత్తం అయ్యాయి. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ ఇప్పటికే ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కరోనా పూర్తిగా నాశనం కాలేదని,ఇటీవల కాలంలో కొత్త వేరియంట్ వెలుగు చూస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా కేరళ, మహారాష్ట్ర, జార్ఖండ్, కర్ణాటక రాష్ట్రాల్లో పాజిటివిటీ రేటు పెరిగిందని చెప్పారు. కరోనా వ్యాధి సన్నద్ధత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు తదితర అంశాలను ఆయన వివిధ రాష్ట్రాలతో చర్చించారు. కేసుల పట్ల ఆందోళన చెందా ల్సిన అవసరం లేకపోయినా అప్రమత్తత అవసరమని కేంద్రం తెలిపింది. కేసులపై నిఘా పెంచాలని, అప్ర మత్తంగా ఉండాలని, అవసరమైన మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని, ఆక్సిజన్, కాన్సంట్రేటర్లు, వెంటిలేటర్లు, వ్యాక్సిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించారు. పనితీరును పరిశీలించేందుకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రతి మూడు నెలలకోసారి ఆసుపత్రులలో సన్నద్ధత పై మాక్‌డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. అలాగే టెస్టుల సంఖ్యను పెంచాలని, తాజా కేసులు, టెస్టులు, పాజిటివిటీకి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు కేంద్రంతో పంచుకోవాలని కేంద్ర మంత్రి మాండవీయ కోరారు. నిజానికి గతేడాది చైనాలో జీరో కొవిడ్‌పాలసీ ఎత్తేశాక వైరస్ కేసులు రోజురోజుకూ పెరిగాయి. మరణాలూ పెద్ద సంఖ్యలోనే నమోదవుతున్నా.. ప్రభుత్వం అధికారికంగా వెల్లడించడంలేదు. మరణాలను పట్టించుకోవడం లేదు. అలాగే మరణాలను ప్రపంచానికి తెలియనివ్వ లేదు. చైనా సహా పలు దేశాల్లో కొవిడ్ ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ఆనాటినుంచే భారత్ అప్రమత్తమైంది. మరోవైపు కరోనా పూర్తిగా అంతం కాలేదని కొత్త వేరియంట్‌లు వస్తున్నాయని గతంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక చేసింది. అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్యసంస్థ కూడా హెచ్చరించింది. కరోనాతో జాగ్రత్తగా ఉండాల్సిందేనని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియచేసింది. రాబోయే రోజుల్లో కరోనా వ్యాప్తి ప్రమాదకరంగా పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తూ వచ్చారు. చైనా కేంద్రంగా కరోనా కేసులు పెరుగుతున్నందున ప్రపంచానికి ముప్పు తప్పదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేసారు. ఇప్పుడు అదే నిజం అయ్యింది. కొత్తగా కేసులు వెలుగు చూస్తున్నాయి. మరోవైపు తెలంగాణలో కరోనా మళ్లీ కలకలం రేపుతోంది. ఇప్పటివరకూ 14 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. బుధవారం ఒక్కరోజే 6 కొత్త కేసులు వెలుగుచూశాయి. కరోనా కొత్త సబ్ వేరియంట్ జేఎన్ 1కేసులు తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రాలకు అలర్ట్ జారీ చేసింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్క్ ధరించాలని అధికారులు సూచిస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం 14 మంది కొవిడ్ బారిన పడి ఐసోలేషన్ లో ఉన్నారు. కాగా, కొత్తగా నమోదైన కేసులన్నీ కూడా హైదరాబాద్‌లోనే నమోదయ్యాయి. దీంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, సిబ్బందితో మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జిల్లా దవాఖానలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొవిడ్ చికిత్స పరికరాలు, ఔషధాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా కొరత ఉంటే సమకూర్చుకోవాలని నిర్దేశించారు. మాక్ డ్రిల్ వెంటనే పూర్తి చేయాలని, దవాఖానల సన్నద్ధతకు సంబంధించిన వివరాలను కేంద్రానికి పంపాలని చెప్పారు. ఇన్ ఫ్లూయెంజా మాదిరిగా శ్వాసకోశ వ్యాధులతో బాధ పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దవాఖానలు, జిల్లా స్థాయిలో విభాగాధిపతులు జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం విధిగా నమూనా లను ఉప్పల్ లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింట్స్ అండ్ డయాగ్నోస్టిక్స్‌కు పంపాలని వెల్లడించారు. రాష్ట్రంలో కరోనా పరిస్థితులపై శనివారం ఆయన మరోసారి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటివరకూ మరణాలు నమోదు కాలేదని, ఒకరు కోలుకొని డిశ్చార్జ్ అయినట్లు అధికారులు తెలిపారు. దేశంలోని కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1 కేసులు ఇప్పటివరకూ 21 వెలుగు చూసినట్లు నీతి ఆయోగ్ సభ్యుడు వీకే పాల్ వెల్లడించారు. ఒక్క గోవాలోనే 14 మంది దీని బారిన పడినట్లు చెప్పారు. మహారాష్ట్ర, కేరళలోనూ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. కేసులు పెరుగుతుండడంపై కేంద్రం అప్రమత్త మైంది. కొత్త వేరియంట్ ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, వైరస్ నియంత్రణకు కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం సజావుగా సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఆస్పత్రుల్లో 3 నెలలకోసారి మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. కొవిడ్ పూర్తిగా ముగిసిపోలేదని, వైరస్ కట్టడికి కేంద్రం పూర్తిగా రాష్ట్రాలకు సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ప్రజలు మరోమారు మాస్కులు దరించి నిత్యం అలవాటుగా మార్చుకోవాలి. ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. లేకుండా స్పీడ్‌గా వ్యాప్తి చెందితే అడ్డుకోవడం కూడా కష్టం కాగలదని గుర్తించాలి. అయితే కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1 అంత ప్రమాదకారి కాదని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, శరవేగంగా వ్యాపించే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని, వారాంతాలు, సెలవులు కావడంతో ప్రయాణాలు తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. బయటకు వెళ్లేటప్పుడు, జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కచ్చితంగా మాస్కులు ధరించాలని ఖచ్చితంగా చెబుతున్నారు.

## క్రిస్మస్‌కు గిఫ్ట్‌లు ఎందుకు ఇచ్చుకుంటారు? ఇంతకీ శాంతాక్లాజ్ ఎవరు?



సర్వ మానవాళి కలిసిమెలిసి సహజీవనం సాగించాలన్నదే క్రీస్తు సందేశం. తోటివారిని ప్రేమించాలన్న ప్రేమతత్వం క్రిస్మస్ పండుగలో కనిపిస్తుంది. క్రీస్తు ఉదయించిన ఈ వేళ క్రైస్తవులకు పర్వదినం. ప్రతి క్రైస్తవుడి జీవితంలోనూ మరుపురాని రోజు. ఈ లోకంలోని వారికి శుభాలు కలిగించేందుకు దైవ కుమారుడైన ఏసు క్రీస్తు ఇలలో అవతరించాడు. లోకరక్షకుడిగా, మార్గదర్శకుడిగా నిలిచాడు. అందరికీ సన్మార్గం చూపి, పాపుల పాలిట రక్షకుడిగా నిలిచిన ఆయన జననం ఎంతో ప్రత్యేకమైనది. దేవుడికి పేర్లు అనేకం. ఆయన మహిమలు కూడా అనంతం. ప్రజలు పలురకాల పేర్లతో క్రీస్తును కీర్తిస్తుంటారు. పేరు ఏదైనా ఆయన తమ పెన్నిధి అని విశ్వసిస్తారు. క్రీస్తు సాటి మనుషులతో ఎలా మసలుకోవాలో తరచూ చెప్పేవాడు. సూక్తులు ప్రబోధించి ఊరుకునే వారు కాదు. వాటిని ఆచరించి చూపేవాడు. 'మీరూ ఇలా చేయాల'ని పిల్లలకు చెప్పినట్టుగా ప్రజలకు పదేపదే తెలియజేసేవాడు. ఆయన శిష్యులు పన్నెండు మందిలో పలురకాల మనస్తత్వాల వారున్నారు. అందులో పేతురు దుడుకు స్వభావి. యోహాను చాలా నెమ్మదస్తుడు. మరొకడు దొంగ. మత్తయి అందరూ అసహ్యించుకునే సుంకం వసూలు చేసే వ్యక్తి. మరొకతను రోమన్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పనిచేసేవాడు. ఇలా వేర్వేరు మనస్తత్వాలు కలిగిన శిష్యగణంతో ఆయనోసారి పంక్తి భోజనానికి కూర్చున్నాడు. ఇంతలో మెల్లిగా లేచి శిష్యుల దగ్గరికి వెళ్లాడు. వరుసగా వారందరి పాదాలు కడిగి తన భుజం మీది తువ్వాలుతో తుడిచాడు. స్వయంగా శిష్యుల పాదాలు కడిగిన క్రీస్తు 'నాయనలారా! మీరు ఒకరి పాదాలు మరొకరు కడగండి' అని వారికి చెప్పాడు. ఒకరి పాదాలు మరొకరు కడగటం అంటే తాము ద్వేషించేవారి పాదాలు కడిగే స్థాయికి ద్వేషాన్ని తగ్గించుకోవాలని పరోక్షంగా హెచ్చరించటమే! కులాలు, తెగలు, బీదరికం, ధనం, అహం అనే ఐదింటినీ పక్కన పెట్టి చేతిలోని ఐదువేళ్లలా ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని ఆ మహాపురుషుడు కోరాడు. మరో సందర్భంలో శిష్యులను చెంతకు పిలిచి 'నాయనలారా! మీరు ఒకరినొకరు ప్రేమించుకోవాలి. ఎంతగా తమను తాము తగ్గించుకుని వినయ మనస్కులు అవుతారో, అంతగా ఆ ప్రేమకు సంపూర్ణత లభిస్తుంది' అన్నాడు. ఆయన సూక్తులు మణిపూసలు. 'ఉపకారికి ప్రత్యుపకారం చేస్తే ఇక నీ ప్రత్యేకత ఏముంది? పాపులు కూడా అలాగే చేస్తారు. కాబట్టి నీవు నీ శత్రువులకు కూడా మేలు చేయి. ఇచ్చిన అప్పును తిరిగి పొందాలని ఆశపడకు. అప్పుడు నీకు గొప్ప బహుమతి లభిస్తుంది. కుడిచేతితో చేసే దానం ఎడమ చేతికి తెలియకూడదు. రహస్యంగా ఉండాలి. నీ రహస్య కార్యాలన్నీ గమనించే తండ్రి నీకు తగిన బహుమానం ఇస్తాడు. నీవు విందు చేసేటప్పుడు బంధువులకు, ఇరుగుపొరుగు వారిని పిలవకు. పేదలను, దివ్యాంగులను పిలువు. వాళ్లు నీకు ప్రతిఫలాన్ని ఇవ్వలేరు కాబట్టి నీవు ధన్యుడవు అవుతావు. నీతిమంతుల పునరుత్థానం రోజున నీకు అందుకు తగిన ప్రతిఫలం దొరుకుతుంది' ఇలా క్రీస్తు చెప్పిన ప్రతి మాటా మానవత్వాన్ని తట్టిలేపేదే. మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేదే. ఆ మహాపురుషుడు పాపులను ఎంతగానో ప్రేమించాడు. వారు పాపంతో మరణించాల్సి వస్తే మరణ శిక్షను తొలగించేందుకు తన ప్రాణాలనే అర్పించాడు. అలాంటి నిస్వార్థ ప్రేమనే ఆయన మన నుంచి ఆశించేది. వసుధపై సర్వమానవ సౌభ్రాతృత్వం ఉండాలని 'నీవలె నీ పొరుగువారిని ప్రేమింపుము' అని ప్రబోధించాడు క్రీస్తు. ఆ వాక్యంలోని లోతును, ఆర్ద్రతను మనిషి అర్థం చేసుకొని ప్రభువు ప్రబోధాలను పాటించినట్లయితే సహనం, సమరస భావం అలవడి మానవుడు మహనీయుడు అవుతాడు. క్రీస్తు సందేశం ఇదే. ఆ మహనీయుడు మన నుంచి కోరుకున్నదీ ఇదే. సెయింట్ నికోలస్ అనే క్రైస్తవ మతగురువునే శాంతా క్లాజ్ అని సంబోధిస్తారు. ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టం. పిల్లలకూ ఆయనంటే అంతే అభిమానం. క్రిస్మస్ సమయంలో ఇతరులకు మనకు తోచిన బహుమతిని ఇస్తుంటాం. కనీసం శుభాకాంక్షలను చెబుతుంటాం. ఈ సంప్రదాయానికి శాంతా క్లాజ్ తాతనే నాంది పలికాడు. క్రిస్మస్ సమయంలో ఇంటింటికీ తిరిగి తనకు ప్రియాతి ప్రియమైన చిన్నారులందరికీ బహుమతులు, ఆట వస్తువులు, చాక్లెట్లు వంటి తినుబండారాలు పంచిపెడుతూ ఉండేవాడు. శాంతా క్లాజ్ స్ఫూర్తితోనే నేటికీ పెద్దల నుంచి పిల్లలకు క్రిస్మస్ సందర్భంగా బహుమానాలు అందుతూ ఉంటాయి. మూర్తీభవించిన ప్రేమకు, నిస్వార్థ పరాయణతకు ప్రతీక శాంతా క్లాజ్. మనకు ఉన్నది ఆనందంతో ఇతరులకు పంచి ఇవ్వడమే మనకు ఆత్మానందాన్నిచ్చే అత్యుత్తమ మార్గమనేది శాంతా క్లాజ్ దివ్య సందేశం.

మొదటిపేజీ తరువాయి

## చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అరాచకాలమయం చేశారని మండిపడ్డారు. ఇలాంటివి చూస్తుంటే మనసు కలచివేస్తుందని, ఒక్కోసారి రాష్ట్రం పరిస్థితి తలచుకుంటే రాత్రి నిద్ర కూడా రాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క చాన్స్ ఇస్తే... నాలుగు సంవత్సరాల 9 నెలల పాటు బాధపడాల్సి వచ్చిందని చంద్రబాబు వివరించారు. చివరికి దేవుడే దిక్కు అనే పరిస్థితికి వచ్చారని వ్యాఖ్యానించారు. కానీ, మన రాతను తిరగరాసే శక్తి మన చేతుల్లోనే ఉందని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఒక రైతుకు, ఒక ఆటోడ్రైవర్ కు, ఒక నిరుద్యోగికి, ఒక మహిళకు ఏమైనా ప్రయోజనం కలిగిందా అని వైసీపీ వాళ్లను అడుగుతున్నా అంటూ నిలదీశారు. రాష్ట్ర ప్రజలు బాగుండాలనే తన నివాసంలో యజ్ఞయాగాలు చేశానని చంద్రబాబు వెల్లడించారు. తుపాన్లను మనం నివారించలేమని, కానీ తగిన చర్యలు తీసుకుంటే వాటి వల్ల కలిగే నష్టాలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. కానీ ఇటీవల తుపాను సందర్భంగా పలు ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ప్రజలను చూస్తే బాధ కలిగిందని చెప్పారు. ప్రజలకు ఏమీ చేయలేకపోతున్నామన్న నిస్సహాయతతో బాధపడ్డానని తెలిపారు. కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల పంటలన్నీ మునిగిపోయాయని పేర్కొన్నారు. హెలికాప్టర్ లో తిరిగేవారికి తుపాను నష్టాలు తెలుస్తాయా తమ్ముళ్లూ అని ప్రశ్నించారు. అదే, టీడీపీ అధికారంలో ఉండుంటే పరిస్థితి మరోలా ఉండేదని, ప్రజల ముఖాల్లో ఆనందం చూసేవరకు వారి వద్దనే ఉండేవాడ్ని అని స్పష్టం చేశారు. వైసీపీ నేతలకు వాటాలు ఇవ్వలేక పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారని చంద్రబాబు విమర్శించారు. ఒక్క విశాఖలోనే రూ.40 వేల కోట్ల విలువైన ఆస్తులను కబ్జా చేశారని ఆరోపించారు. వీళ్ల కన్ను పడితే అంతే సంగతులని అన్నారు. “విశాఖలో గాదిరాజు ప్యాలెస్ ను వైసీపీ నేత అడిగారు... ఇవ్వకపోతే ఆ భూమి ప్రభుత్వ స్థలంలో ఉందంటూ బెదిరిస్తున్నారు. ఆ భూమి 22-ఏ కేటగిరీలో ఉందంటూ ఆ ప్యాలెస్ యజమానిని వేధిస్తున్నారు. గుంటూరులో శంకర్ విలాస్ హోటల్ పరిస్థితి కూడా ఇంతే. రంగనాయకమ్మ అనే మహిళ గతంలో ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంపై ట్వీట్ పెట్టారు. అదే ఆమె చేసిన పాపం అయింది. అప్పట్నించి ఆమెను వేధించడం మొదలుపెట్టారు. శంకర్ విలాస్ ను కొనసాగకుండా అడ్డుకున్నారు. అంతేకాకుండా, దాడులు కూడా జరగడంతో ఆమె శంకర్ విలాస్ మూసివేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ పక్కనే ఆమె చిన్న వ్యాపారం చేసుకోవాలని ప్రయత్నించినా, అడ్డుకున్నారు. దాంతో విధిలేని పరిస్థితుల్లో ఆమె గుంటూరు వదిలి హైదరాబాద్ వెళ్లిందంటే రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రజలందరూ వీళ్లకు బానిసలుగా ఉండాలి... లేకపోతే రాష్ట్రం వదిలి వెళ్లిపోవాలి! ఇది ప్రజాస్వామ్యమా అని అడుగుతున్నా. ఎవరైనా మాట్లాడితే వారిపై కేసులు పెట్టేస్తారా? నాకు అన్యాయం జరిగిందని ఎవరైనా అంటే వారిపై రౌడీలు వచ్చి పడిపోతారా? ఏ మాత్రం విశ్వసనీతయ లేని వ్యక్తి, ఏ మాత్రం విలువలు లేని వ్యక్తి ఈ జగన్ మోహన్ రెడ్డి” అంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. పెదకూరపాడు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ఈసారి టికెట్ ఇవ్వడంలేదని, అతడిని మార్చుతున్నారని చంద్రబాబు వెల్లడించారు. శంకరరావును తీసుకొచ్చి ఎమ్మెల్యేని చేశారని, కానీ అతడిని దొంగ ఇసుక వ్యాపారం చేయమన్నారని వివరించారు. సీఎం చెప్పినట్టే శంకర్రావు చేశాడని, కానీ, శంకర్రావు వల్ల తనకు చెడ్డపేరు వచ్చిందని, అతడిని మార్చితే తనకు మంచి పేరు వస్తుందని ఇప్పుడు మరొకరికి టికెట్ ఇస్తున్నాడని చంద్రబాబు పేర్కొన్నారు. కానీ శంకర్రావును మార్చితే పరిస్థితులు మారవని, మార్చాల్సింది ఈ ముఖ్యమంత్రినే అని చంద్రబాబు స్పష్టం చేశారు. త్వరలోనే తాను ప్రజల్లోకి వస్తానని, రాబోయే ఐదేళ్లలో తాము ఏం చేయబోతున్నామో అందరికీ వివరిస్తామని తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీ చిత్తు చిత్తుగా ఓడిపోవడం ఖాయమని, రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న శని జగన్ వదిలిపోవడం తథ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## సమానత కోసం నినదించే సాక

జీవితాన్ని దాచకుండా దండోరా వేసినట్టు చెప్పడంలో కథా ప్రక్రియ చాలా ఉపయోగపడుతుంది. సుత్తి లేకుండా చెప్పడంలోనే కథకుడి నేర్పరితనం కనపడుతుంది. సాంపి జల్లి వాకిట్లో ముగ్గు వేసినంత అందంగా కథను అల్లడంలోనే కథకుడి నైపుణ్యం తెలిసిపోతుంది. బతుకును, జీవితాన్ని ఏ ప్రమాణాలు కొలుస్తాయి? వస్తువు శిల్పం శైలి ప్రమాణాలకందని జీవితం ఉంటుంది. ఇది దళిత కథ. ఇందులో అలంకారాలు, విచిత్ర విన్యాసాలు, పద ప్రయోగాలు ఉండవు. బతుకును చిత్రించిన బాధలే ఉంటాయి. జీవితాన్ని మించిన కథ ఇంకేం ఉంటుంది? ఈ వార్షికలోని దళిత కథలు బతుకునే చిత్రించాయి. బాధలను ప్రతిబింబించాయి.'జంబూ సాహితీ' నుంచి వెలువడుతున్న వార్షికలలో 'సాక' ముచ్చటగా మూడవది. 'సాక'కు అర్పించడం, అర్పణం, తర్పణం, ధారపోయడం లాంటి అర్థాలున్నాయి. దళిత కథను రికార్డు చేయడం, వాటిలోని మేలైన కథలను ఒక దగ్గరికి చేర్చడం జంబూ సాహితీ ఏటా చేస్తున్న ఆనవాయితీ. ఈ కథలు పత్లా కథలు కావు. గుండె లోతుల్లోని తేమను ఉసిలించే కథలు. నిద్రాణమై ఉన్న మనిషి చర్మన సరుపు సరిచి లేపే చైతన్యపూరితమైన కథలు. ఇందులో భిన్నమైన కథా వస్తువులున్నాయి. ఇప్పుడు కథల గురించి కొత్తగా మాట్లాడుకోవాలి. సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే రచయిత జీవితాన్ని అర్థం చేసుకోవాలి. సెయింట్ బోవే (1804-1869) చెప్పినట్టు 'దళిత కథ' అర్థం చేసుకోవాలంటే దళితులు అనేక వేదనల మధ్య, జీవితాలను కోల్పోయిన దుస్థితుల మధ్య నలుగుతున్న స్థితిని కొత్తగా సరికొత్తగా మాట్లాడుకోవాలి. నిజానికి దళితులకు తమకేం కావాలో స్పష్టంగా తెలిసినా వస్తువు 'ఎంపిక' సమస్య ఒకటి ఎప్పుడూ ఉండనే ఉన్నది. ఎన్నో బాధలు. ఏ బాధలు ముందుగా అక్షరీకరించాలో కొద్దిగా సందిగ్ధత ఉంటుంది. అయినప్పటికీ అన్ని బాధలు, కథలు కాలేవు. అందరూ బలంగా మాటల్లో రాజ్యాధికార కాంక్షను 'వ్యక్తం' చేస్తున్నారు కానీ, ఉన్నతవర్గాల వారి 'మనీ క్రీడ'ను తట్టుకోలేకపోతున్నారు. అంతర్గతంగా కుల ప్రస్తావనలు ఎలా తికమక పెడుతున్నాయో? జీవితాంతం ఎలా బాధిస్తున్నాయో? ఎలా భయపెడుతున్నాయో అనుబంధాలను తెంచేయటాన్ని దళిత నిప్పుల తప్పటై మోగుతున్నాయి.

తండ్రీ కూతురు ఒక్కటై తల్లిని వేధించడానికి ఏది కారణమై ఉంటుందో తల్లి జీవితాన్ని వెంటాడుతున్న సమస్య ఏమిటో తెలుసుకోవాలంటే సతీష్ చందర్ 'యువరానర్' కథ చదివితే జీవితమంతా బాధించిన విషయం అవగతమవుతుంది. కుల వివక్ష ప్రతినిధి అయి పీడించిన వ్యక్తిని అంతిమ సంస్కారంలో అయినవాళ్లు, ప్రోత్సహించిన వాళ్లు ఎవరు రాలేదు. మహోన్నత మనసుతో పురుగులు పడ్డ శవాన్ని దళితులు ఎలా మోశారో తెలియజేసే జూపాక సుభద్ర కథ 'అప్పు పడ్డది సుమీ' చదువాల్సిందే. కులం గొప్పదైతే గొప్ప కాదు. గుణం గొప్పగా ఉండాలని, ఆ గొప్ప గుణం దళితులకు ఉన్నదని ఎలా రూపం చేసిందో జిలుకర శ్రీనివాసు రాసిన 'బురద గుంట' కథ అధ్యయనం చేస్తే కానీ అర్థం కాదు. బతుకు పోరులో ఓడి గెలిచిన సైనికుల గొప్పతనం, బతుకంతా సాము చేసి నిలిచి గెలిచిన సుందరమ్మ స్ఫూర్తి ఏమిటో అర్థం కావాలంటే చల్లపల్లి స్వరూపారాణి రాసిన 'సాము' కథ ఆవాహన చేసుకోవాల్సిందే. దళితులు పెనవేసుకున్న క్రైస్తవ్యం, పోరాటం నేర్పిన కమ్యూనిజం, అస్తిత్వమే అంతిమ కలికితురాయని ప్రకటించిన అంబేద్కరిజం, వీటి మధ్యలో డోలాయమానమైన స్థితి నుంచి ఒక నిశ్చిత ఆలోచన తెలియాలంటే పసునూరి రవీందర్ కథ 'ఒక నేల మూడు ముఖాలు' త్రికరణశుద్ధిగా పఠించాల్సిందే. జీవితాన్ని ఎలా జీవించవచ్చో నేర్పుతుంది మంచి దళిత కథ. తెలుగు కథ ఇంకా అంటరానితనం దాటలేకపోయినందున అపవాదు ఒకటి ఉండటానికి కారణం కులమే. 'ముక్కు ఉన్నంతసేపు పడిశం ఉంటుంది' అన్నట్టుగా కులవివక్ష ఉన్నన్ని రోజులు దళితులకు వివక్ష అటరానితనం తప్పేటట్టు లేదు. ఈ విషయాన్ని చాలా కథలు తెలియజేస్తున్నాయి.

స్వీయ అస్తిత్వ పరిరక్షణ కోసం వైరుధ్యాల తగ్గింపు కోసం కృషిజరగాలి. మనుషులు ఎందుకు ఇంకా మారడం లేదు, ముఖ్యంగా చదువుకున్న మనిషి ఎందుకు ఇంతలా కులచట్రంలో కుంచించుకుపోతున్నాడు? అనే ప్రశ్నలకు ఈ కథలు కొంత సమాధానాన్ని ఇవ్వగలవు. లోపలి బాధను తోడిపోసిన చరణ్ పరిమి కథ 'అతిథితో అక్కడిదాకా!' గుండెను పిండేస్తుంది. హావింగ్ లైఫ్, హావ్ నాట్ లైఫ్‌కు మధ్య ఏదో కనెక్షన్ తెగిపోయినట్టు ఈ కథ మనకు తెలుపుతుంది. క్రైస్తవం హైందవీకరించబడిందా? హిందువులు క్రైస్తవీకరించబడుతున్నారా? అనే మీమాంసను క్లియర్ జేసే వాస్తవిక కథ మెర్సీ మార్గరెట్ రాసిన 'వర్షం సాక్షిగా'.. తెలియాల్సిందే. ఒకే ఊరి నుంచి అగ్ర కుల పటేలు రామారావు, మాదిగ కులానికి చెందిన రాములు ఇద్దరు పట్నం వలస వచ్చి, పట్నం వచ్చినంక కూడా కుల వివక్షను, ఆధిపత్యాన్ని వదులుకోలేని తనాన్ని పటేల్ అహంకారాన్ని పట్టించే కథ తాళ్లపల్లి యాకమ్మ రాసిన 'వెన్నెల గొడుగు' కథ. అదేవిధంగా అగ్ర కులాలకు దళితులు ఎలా బలైపోతున్నారో తెలియజేసే కథ కెంగార మోహన్ రాసిన 'సమిధలు' కథ. చదువుకొని ఉద్యోగం వచ్చిన తర్వాత, చాలామంది దళితులు తమ మూలాలను మరిచిపోతున్నారు. సోఫిస్టికేటెడ్ లైఫ్‌కు అలవాటుపడిన తర్వాత తాను నడిసొచ్చిన, ప్రయాణాన్ని, మార్గాన్ని తామే అవమానిస్తుంటారు కొందరు దళితులు. 'ఎంత దూరం వెళ్లినా మేము మాకులాగానే ఉంటాం' అంటూ మూలాలను తెలియజేసే కథ అనిల్ డానీ 'వీకెండ్'. గర్భిణీ చనిపోతే బొందలగడ్డలో పూడ్చిపెట్టనీయకుండా అవమానించి, అడ్డుకొని, కడకు బొందల గడ్డలో కూడా స్త్రీ వివక్ష ఎదుర్కొంటున్నదని తెలియజేసే కథ డీజీ హైమవతి రాసిన 'బొందల గడ్డకు దూరంగా' అనే కథ. ఇవేకాకుండా పెనుమాక రత్నాకర్, సోలోమోన్ విజయ్, సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్ రాసిన కథలు కూడా ఆలోచింపజేస్తున్నాయి. అసూయ అనేది దోపిడీ కులాలు, దోపిడీకి గురయ్యే కులాల్లోనే కాదు, కింది కులాల్లో కూడా అంతర్గతంగా ఉంది. ఆ అసూయ పెరిగిపోతుంది. ఇది తగ్గించాలంటే ఇంకా ఉత్తమ కథలు రావాలి. ఆధిపత్య వర్గాలు ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచించాలి. అంబేద్కర్ మార్గాన్ని ఆచరించాలని ఈ కథల్లో అంతర్గతంగా ఒక ఆలోచన ఉన్నది. ఈ కథల్లో సాంస్కృతిక వ్యత్యాసం, కులమతాల ఆర్థిక వ్యత్యాసం, ఆధిపత్యాలు మొదలైన వస్తువులతో కథలు నడిచాయి. దళిత జీవితం అధునాతనమైన వ్యవస్థలోకి ఈ కథల్లో సాంస్కృతిక వ్యత్యాసం, కులమతాల ఆర్థిక వ్యత్యాసం, ఆధిపత్యాలు మొదలైన వస్తువులతో కథలు నడిచాయి. దళిత జీవితం అధునాతనమైన వ్యవస్థలోకి చేరుకోవాలని కోరుతున్నాయి ఈ కథలు. జీవితానికి సంబంధించిన సున్నితమైన సమస్యలను సెన్సిటివ్‌గా వ్యక్తీకరించిన కథలు ఇవి. కథలను ఎంపిక చేయడంలో మాకు కష్టమైనప్పటికీ ఇష్టంగా చేస్తున్న పనిగా భావిస్తూ అందరికీ జై భీమ్.

మార్పు కోసం ...
మరో ఉదయం

# బడుగు బలహీన వర్గాల కోసం పోరాటాలు చేసే పార్టీ సీపీఐ

మంచిర్యాల డిసెంబర్ 24

(మరోఉదయం)



సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ 99 ఆవిర్భావ వేడుకలను రామ కృష్ణ పూర్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి లిసీపీఐ రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ముందుగ రామకృష్ణపూర్ పార్టీ కార్యాలయంలో మహిల నాయకురాలు పెంద్యాల కమలమ్మ, గాజుల మనెమ్మ కేక్ కట్ చేసి నారు, అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి ముఖ్య కుడల్లలోని పార్టీ జెండాలు ఆవిష్కరించారు రాజీవ్ చౌక్ లోని జెండాను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద జెండాను జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు సూపర్ బజార్లోని జెండాను జిల్లా సమితి సభ్యులు కాదండి సాంబయ్య ఆర్కే వన్ స్తూపం వద్ద సిపిఐ జిల్లా సమితి సభ్యులు వనం సత్యనారాయణ రామాలయంలోని జెండాను కౌడగాని సాంబయ్య రైల్వే స్టేషన్ లోని జెండాను గాజుల మణెమ్మ బీ జూన్ రాంనగర్ లోని జెండాను మారపల్లి రవి ఆవిష్కరించారు ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్ సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ ఈనెల 20 నుండి 26 వరకు జరుగు సిపిఐ 99 ఆవిర్భావ వేడుకలను పట్టణ మండల గ్రామ స్థాయిలలో అరుణ పతాకలను ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగింది అన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో ఆవిర్భవించినటువంటి పార్టీ ఆవిర్భవించినాడే దున్నే వారికి భూమి కావాలని పార్టీ చెప్పడం జరిగినది నాటి నుండి నేటి వరకు బడుగు బలహీన వర్గాల పేద ప్రజల కార్మిక కర్షకుల కోరకు ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదీ అన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ఫలితంగా కార్మికుల కర్షకుల పక్షాన అనేక హక్కులను చట్టాలను తీసుకురావడం జరిగిందన్నారు. పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు చేస్తుంది అన్నారు. నాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేసి దున్నేవాడికి భూమి కావాలి అని సుమారు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్,జల్లా సమితి సభ్యులు మిట్ట పెల్లి పౌలు, వనం సత్యనారయణ, పేర్క సంపత్, కాదండి సాంబయ్య, పెంద్యాల కమలమ్మ, మహిళ సమాఖ్య పట్టణ కార్యదర్శి గాజుల మణెమ్మ, సిపిఐ నాయకులు ఎగుడా మొండి మాధవ్, శంకర్, అక్కల శంకర్, క్యాథరాజు ప్రభాకర్, గుమాస్ మల్లేష్, బైర కొమురెల్లి, గాజుల రాయమల్లు, బూతగడ్డ ఓదెలు, బోయపోతుల కొమురయ్య, జంగపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొనారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

## నూతన వస్త్రాలను అందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్





జూలూరుపాడు డిసెంబర్ 24

మరోఉదయం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు కేంద్రంలోని ఏవిఆర్ ఫంక్షన్ హాల్లో క్రిస్మస్ వేడుకలు ఆది వారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హాజరు అయ్యారు. క్రిస్టియన్ సోదరులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1000 మందికి నూతన వస్త్రాలు బహుమతి గా అందించడం జరిగింది అన్నారు. వచ్చే సంవత్సరం నుండి ఈ కనుక క్రిస్టియన్ సోదరులకు అందరికి అందేవిధంగా చూస్తాము అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందించే సంక్షేమ పథకాలను 100 రోజుల లోపే అమలు చేయడానికి కృషి చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం 7 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసింది. ఆనాడు కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలే ఈ నాటికి కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం బొర్రా రాజశేఖర్ ,లేళ్ళ వెంకటరెడ్డి మండల పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు వెంపటి ఎలీషా , కబీర్ దాస్ , పోతురాజు మహేష్ విక్టర్ , దామెర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

# వృద్ధురాలికి కడగొండ సాయికుమార్ మిత్రబృందం సభ్యుడి రక్తదానం

మంచిర్యాల డిసెంబర్ 24 (మరోఉదయం)

గద్దేరాగడికి గ్రామానికి చెందిన రాజమ్మ అనే వృద్ధురాలు రక్త బలహీనతతో బాధపడుతుండగా ఆమెకి అత్యవసరంగా ఓం పాజిటివ్ రక్తం అవసరం అని స్థానిక సింగరేణి ఆసుపత్రి వైద్యులు తెలపగా వృద్ధురాలి కుటుంబ సభ్యులు కడగొండ సాయికుమార్ మిత్రబృందం సభ్యులను సంప్రదించగా వారు వెంటనే స్పందించి రక్తదాత ముత్తమల్ల భువనేశ్వర్ ని ఆసుపత్రికి తీసుకువెళ్ళి రక్తదానం చేపించడం జరిగింది.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి ఆపద ఉన్న ప్రతి ఒక్కరికీ వారి మిత్రబృందం అందుబాటులో ఉండి తగిన చేయూతను అందిస్తామని యువకులు రక్తదానం చేయడంలో ముందుండాలని రానున్న రోజుల్లో వారి మిత్రబృందం ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు విద్యార్థులకు అవసరం ఉన్న ప్రతి ఒక్క పేద వారికి తోచిన సహాయాన్ని అందిస్తూ అత్యవసరంగా రక్తం అవసరం ఉన్న ప్రతి ఒక్కరికీ రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటలు కడగొండ సాయికుమార్ మిత్రబృందం సభ్యులు అందుబాటులో ఉంటారని, ఎవరైనా నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న వారికి సహాయం అందించడానికి అత్యవసరంగా రక్తం అవసరం ఉంటే మా ఫోన్ నంబర్ 7702725982 కి సంప్రదించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడగొండ సాయికుమార్, మిత్రబృందం సభ్యులు శానగొండ రాజుకుమార్, శివ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా రేణుకా మాతా కు బోనాలు....

మెదక్, మరోఉదయం ప్రతినిధి న్యూస్ డిసెంబర్ 24:-

అమ్మ దీవించు తల్లి అంటు రేణుకా మాతకు ఘనంగా బోనాలను సమర్పించారు. తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కొల్చారం గౌడ సంఘం ఆధ్వర్యంలో అందంగా పసుపు కుంకుమలతో అలంకరించిన బోనాలను నూతన వస్త్రాలు ధరించిన మహిళలు బోనం నెత్తిపై పెట్టుకొని ప్రధాన వీధుల్లో గుండా ఊరేగిస్తూ నైవేద్యంతోపాటు బోనాలను సమర్పించారు . ముందుగా ఉదయాన్నే ఘటాన్ని ఎదుర్కొని గ్రామ కల్లు డిపో నుండి డోలు వాయిద్యాలతో వెళ్లి ప్రత్యేక పూజలు చేసి ఘటాన్ని ప్రారంభించారు. శివ సత్తుల పూనకలు యువకుల నృత్యాలు, డోల్ వాయిద్యాల మధ్య భోనాలు ఊరేగించి రేణుకా ఎల్లమ్మ కు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమా రాజగౌడ్, ఎంపీటీసీ అరుణ కృష్ణ గౌడ్, రామకృష్ణ గౌడ్, ప్రభాకర్,అశోక్ గౌడ్,రామకృష్ణ గౌడ్, యాదగౌడ్,దుర్గ గౌడ్, దుర్గాప్రసాద్ గౌడ్, రాజా గౌడ్ రాజేందర్ గౌడ్,కిరణ్ గౌడ్,బుమగౌడ్,నారా గౌడ్ శేఖర్ గౌడ్,పాపా గౌడ్ లక్ష్మీనారాయణ గౌడ్,రామా గౌడ్,శివకుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ గణేష్ గౌడ్, కృష్ణ గౌడ్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

# తెలంగాణలో కరోనా కేసుల వివరాలు

-దేశంలో జేఎన్1 వేరియంట్ కలకలం -కరోనా పరీక్షల సంఖ్యను పెంచిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు

-తెలంగాణలో తాజాగా 12 పాజిటివ్ కేసుల గుర్తింపు

దేశవ్యాప్తంగా మరోసారి కరోనా కేసుల వ్యాప్తి కొనసాగుతోంది. ఇటీవల జేఎన్1 వేరియంట్ వెలుగు చూసిన నేపథ్యంలో... రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్యను పెంచాయి. తాజాగా, తెలంగాణలో 1,322 శాంపిళ్లను పరీక్షించగా... 12 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మరో 30 మంది ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. తాజా పాజిటివ్ కేసులతో కలిపి రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 8,44,540కి పెరిగింది. ఇవాళ ఒకరు కరోనా నుంచి కోలుకున్నారు. తెలంగాణలో కరోనా రోగుల రికవరీ రేటు 99.51 శాతంగా ఉంది.

# అనాథ బాలలతో ప్రీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్న పవన్ కల్యాణ్ అర్ధాంగి అనా

హైదరాబాదులోని జీవోదయ చిల్డ్రన్ హోమ్ కు వెళ్లిన అనా కొణిదెల

అక్కడి చిన్నారుల నడుమ కేక్ కట్ చేసి సంబరాలు

చిన్నారులతో ముచ్చటించి వారి విద్యాబుద్ధులు తెలుసుకున్న వైనం

అనా కొణిదెలను సత్కరించిన హోమ్ నిర్వాహకులు

జనసేన పార్టీ అధినేత, టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అర్ధాంగి అనా కొణిదెల అనాథ బాలల నడుమ ప్రీ క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. అనా కొణిదెల ఇవాళ హైదరాబాద్ బాలాజీ స్వర్ణపురి కాలనీలో ఉన్న జీవోదయ హోమ్ ఫర్ చిల్డ్రన్ అనాథ శరణాలయానికి వెళ్లారు. అక్కడి చిన్నారులతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. అనాథ బాలలతో ముచ్చటించి వారి విద్యాబుద్ధుల గురించి తెలుసుకున్నారు. అనాథాశ్రమం నిర్వాహకులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ అర్ధాంగిని జీవోదయ చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు సత్కరించారు. దీనికి సంబంధించిన ఫొటోలను జనసేన పార్టీ సోషల్ మీడియాలో పంచుకుంది.





మొదటిపేజీ తరువాయి

# ఈ నెల 28 నుంచి ఆరు గ్యారెంటీల దరఖాస్తులు స్వీకరిస్తాం: పొంగులేటి

- ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు ప్రకటించిన కాంగ్రెస్
- ఎన్నికల్లో గెలిచి రేవంత్ రెడ్డి సీఎంగా ప్రభుత్వం ఏర్పాటు
- ఇప్పటికే రెండు గ్యారెంటీల అమలు

తెలంగాణ అధికార పక్షం కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు ప్రకటించిన సంగతి తెలిసిందే. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో, ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమైంది. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరాలు తెలిపారు. ఆరు గ్యారెంటీలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించారు. ముందుగా ఈ దరఖాస్తులను ప్రజలకు అందిస్తామని, ఆపై వాటిని డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుందని వివరించారు. గ్రామసభల్లో ఈ దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు సమర్పించిన వారికి అధికారులు ఒక రసీదు ఇస్తారని పొంగులేటి చెప్పారు. అధికారులు ఆ దరఖాస్తులు పరిశీలించి, వారు ఏ పథకాలకు అర్హులో నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ఓ ప్రాంతంలో కేవలం 10 ఇళ్లు ఉన్నా సరే, అధికారులు అక్కడికి వెళ్లి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించామని పొంగులేటి స్పష్టం చేశారు. తామిచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేశామని, మిగిలిన నాలుగింటిని కూడా అమలు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో మంత్రులు కూడా పాల్గొన్నారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పై వివరాలు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# ఆ రాష్ట్రాల వాళ్లు తమిళనాడులో టాయిలెట్లు కడుగుతుంటారు: దయానిధి మారన్

బీహార్ ల నుంచి వచ్చేవాళ్లు తమిళనాడులో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తుంటారని, టాయిలెట్లు కడుగుతుంటారని దయానిధి మారన్ అన్నారు. సుందర్ పిచాయ్ తమిళనాడు వ్యక్తి అని, ఇప్పుడు గూగుల్ ను నడిపిస్తున్నాడని గర్వంగా చెప్పారు. ఒకవేళ సుందర్ పిచాయ్ గనుక హిందీ నేర్చుకుని ఉంటే ఇక్కడే భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ ఉండేవాడని దయానిధి మారన్ వ్యాఖ్యానించారు. తమిళనాడులో చిన్నప్పటినుంచే ఇంగ్లీషు నేర్పించడం వల్ల వారు ఐటీ రంగంలో ఉద్యోగాలు సాధించి మంచి వేతనాలు పొందుతున్నారని వివరించారు. కాగా, దయానిధి మారన్ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. డీఎంకే నేతలపైనా, ఇండియా కూటమి పెద్దలపైనా పూనావాలా విమర్శనాస్త్రాలు సంధించారు. దేశంలో మరోసారి విభజన రాజకీయాలు చేసే ప్రయత్నం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట రాహుల్ గాంధీ ఉత్తరాది ఓటర్లను అవమానించారని, ఆ తర్వాత రేవంత్ రెడ్డి బీహార్ డీఎన్ఏను విమర్శించారని, డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ గోమూత్ర రాష్ట్రాలు అని నోరుపారేసుకున్నారని పూనావాలా వివరించారు. ఇప్పుడు దయానిధి మారన్ చేసింది కూడా అదేనని, హిందీ మాట్లాడే ఉత్తరాది ప్రజలను అవమానించాడని ఆరోపించారు. హిందువులను నోటికొచ్చినట్టు మాట్లాడడం, సనాతన ధర్మాన్ని కించపర్చడం ఇండియా కూటమి డీఎన్ఏలోనే ఉన్నట్టుందని విమర్శించారు. అంతేకాదు, ఇండియా కూటమిలో ఉన్న జేడీయూ నేత, బీహార్ సీఎం నితీశ్ కుమార్ విధానాల వల్లే బీహారీలు తమిళనాడుకు వలస వెళ్లాల్సి వస్తోందని షెహజాద్ పూనావాలా వ్యాఖ్యానించారు.

# ప్రశాంత్ కిశోర్ ను 2019లోనే వాడేశాం!:

మొదటిపేజీ తరువాయి

వ్యూహకర్తగా పెట్టుకుంటున్నాడని విమర్శించారు. "ఇదే ప్రశాంత్ కిశోర్ ను మేం వ్యూహకర్తగా పెట్టుకుంటే, వాడెవడో బీహార్ నుంచి వచ్చాడట తమ్ముళ్లూ... మనల్ని ఏం పీకుతాడు, మనకంటే గొప్పవాళ్లు ఈ ప్రపంచంలో ఉన్నారా? అని చంద్రబాబు మాట్లాడాడు. జగనే బాబాయ్ హత్య చేయించారని, జగనే కోడికత్తితో పొడిపించుకున్నారని, వీటి వెనుక ఉన్నది ప్రశాంత్ కిశోరే అని చంద్రబాబు చెప్పాడు. ప్రజలను రెచ్చగొట్టి గెలిపించేందుకు ప్రశాంత్ కిశోర్ ప్రణాళిక రచించాడని అన్నాడు. ఇప్పుడు ప్రశాంత్ కిశోర్ ను పెట్టుకున్నారు కదా... మరి చంద్రబాబు పీక కోయించుకుంటాడా, లేక, లోకేశ్ తండ్రిని చంపుతాడా? అనేది వాళ్లకే తెలియాలి. చంద్రబాబు అవుట్ డేటెడ్ పొలిటీషియన్. మేం ఎప్పుడో 2019లో వాడేసిన వ్యక్తిని తీసుకొచ్చి 2024 ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నాడు. అసలు, ప్రశాంత్ కిశోర్ కు ఐప్యాక్ కు సంబంధం లేదు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత ఇక నేను వ్యూహకర్తగా పనిచేయడం లేదు, బీహార్ లో రాజకీయ పార్టీ పెట్టాను అని ప్రశాంత్ కిశోరే చెప్పాడు. నిన్న అతడు చంద్రబాబు వద్దకు వచ్చింది కూడా మమతా బెనర్జీ తరఫున మాట్లాడ్డానికి. ఇండియా కూటమిలో చేరమని అడగడానికి వచ్చాడు. చంద్రబాబు ఒక పీకేని పెట్టి బీజేపీతో చర్చలు జరుపుతున్నాడు, మరో పీకేని పెట్టి కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమితో చర్చలు జరుపుతున్నాడు. చంద్రబాబునాయుడిది రెండు కళ్ల సిద్ధాంతం. ఎవడు అధికారంలోకి వస్తాడో చంద్రబాబుకు అర్థంకావడంలేదు. కేంద్రంలో బీజేపీ వస్తుందో, లేక కాంగ్రెస్ వస్తుందో అనే కన్ఫ్యూజన్ లో ఉన్నాడు. అందుకే... వాళ్లు కాకపోతే వీళ్లు, వీళ్లు కాకపోతే వాళ్లు అనుకుంటూ ఇద్దరు పీకేలను పెట్టుకున్నాడు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు. ఏ పీకేని పెట్టుకున్నా జగన్ వెంట్రుక కూడా పీకలేరు" అంటూ కొడాలి నాని వ్యాఖ్యానించారు.

SUN - M U_SAT - M U.qxd 25-12-2023 02:33 AM Page 4



మరో ఉదయం






# లేడీ సూపర్ స్టార్ నయనతార 20 ఇయర్స్ ఇన్ ఇండస్ట్రీ..

చంద్రముఖి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది బెంగళూరు చిన్నది నయనతార . ఆ తర్వాత తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. లీడింగ్ హీరోలతో సినిమాలు చేస్తూనే.. మరోవైపు సోలో హీరోయిన్‌గా ఓ వెలుగు వెలుగుతూ లేడీ సూపర్ స్టార్‌గా మారిపోయింది. సక్సెస్‌ఫుల్‌గా కెరీర్ కొనసాగిస్తూ డిసెంబర్ 25తో రెండు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకోనుంది. ఈ సందర్భంగా నయనతారకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. నయన్ జర్నీతో డిజైన్ చేసిన నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా నయన్‌ను విష్ చేస్తూ.. లేడీ సూపర్ స్టార్ కెరీర్‌లో మరిన్ని విజయాలు అందుకోవాలని.. మూవీ లవర్స్‌ను మరింత ఎంటర్‌టైన్ చేయాలని నెటిజన్లు, ఫాలోవర్లు, కోస్టార్లు ఆకాంక్షిస్తున్నారు. నయనతార నయన్ కెరీర్‌లో 75వ సినిమాగా వచ్చిన 'అన్నపూరణి' డిసెంబర్ 01న ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి నీలేష్ కృష్ణ దర్శకత్వం వహించాడు.

నయనతార నయన్ కెరీర్‌లో 75వ సినిమాగా వచ్చిన 'అన్నపూరణి' డిసెంబర్ 01న ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి నీలేష్ కృష్ణ దర్శకత్వం వహించాడు. ఎస్. ఆర్.రవీంద్రన్ సమర్పణలో, నాస్ స్టూడియోస్ –ట్రైడెంట్ ఆర్ట్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ మూవీ సూపర్ టాక్‌తో థియేటర్‌లలో స్క్రీనింగ్ అవుతుంది. మరోవైపు ఓటీటీలో కూడా సందడి చేసేందుకు రెడీ అవుతోంది. ఈ చిత్రాన్ని పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిసెంబర్ 29 నుంచి ఈ సినిమా తమిళం, తెలుగు, కన్నడ. మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతం రెండు తమిళ సినిమాల్లో నటిస్తుండగా.. చిత్రీకరణ దశలో ఉన్నాయి.

# ఆ ఆస్తులు అమ్మేసిన బోనీకపూర్.. ఎంత ధర పలికాయో తెలుసా..?

దివంగత అలనాటి తార శ్రీదేవి (%వాతీఅఎవజఱ%) మరణం తర్వాత బోనీకపూర్ ప్రొఫెషనల్ కెరీర్‌పై దృష్టిసారించారని తెలిసిందే. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు తెరకెక్కిస్తూ భారీగానే లాభాలు ఆర్జించినట్టు బీటౌన్ కథనాల సమాచారం. కాగా కొన్ని నెలల క్రితం బోనీకపూర్, కూతుళ్లు కలిసి ముంబైలో ఓ బంగ్లాను కొనుగోలు కూడా చేశారు. ఇదిలా ఉంటే ఓ షాకింగ్ న్యూస్ బీటౌన్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. అదేంటంటే బోనీకపూర్ ముంబైలో తనకు సంబంధించిన నాలుగు అపార్ట్‌మెంట్స్‌ను అమ్మేశాడట.

తాజా టాక్ ప్రకారం శ్రీదేవి, బోనీపూర్ పేరు మీదున్న ఈ బంగ్లాలను 12 కోట్లకు అమ్మాడట. అంతేకాదు కపూర్ ఫ్యామిలీ ఈ డబ్బులతో మరో భారీ ప్రాపర్టీలో పెట్టుబడులు పెట్టాలని ప్లాన్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. అంధేరీలోని గ్రీన్ ఎకర్స్ ఏరియాలో ఉండే ఒక్కో డబుల్ బెడ్ రూం ప్లాట్ (నాలుగు) రూ.4 కోట్ల చొప్పున అమ్ముడుపోయినట్టు బీటౌన్ సర్కిల్ టాక్. బోనీకపూర్, కూతుళ్ల తరపున జాన్వీకపూర్ కూడా రియల్ ఎస్టేట్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్టు టాక్.

శ్రీదేవి 80స్‌లో కెరీర్ జోష్‌మీదున్న సమయంలో చెన్నైకి సమీపంలోని మహాబలిపురం ఈస్ట్ కోస్ట్ రోడ్‌లో బీచ్ దగ్గర ఐదెకరాల ప్రాపర్టీ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అయితే బీచ్ పేస్‌లో డ్రీమ్ హౌస్(హొటల్) నిర్మించుకోవాలనే కోరిక తీరకుండానే అందరినీ విడిచిపోయింది. దీంతో తన సతీమణి చిరకాల కోరికను నెరవేర్చేందుకు.. శ్రీదేవి చనిపోయిన ఐదేళ్ల తర్వాత తాజ్ గ్రూప్ పార్ట్‌నర్‌షిప్‌లో హొటల్‌గా అభివృద్ధి కూడా చేశారు. శ్రీదేవి డ్రీమ్ హౌస్ లొకేషన్ ఫొటోలు ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# 2023 లో బాక్సాఫీస్ షేక్..

## దళపతి విజయ్ క్రేజ్ అంటే అంతే మరి..!



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాలెంటెడ్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు దళపతి విజయ్ . ఈ స్టార్ హీరో కాంపౌండ్ నుంచి సినిమా వస్తుందంటే చాలు తమిళనాడు రికార్డుల మోత మోగాల్సిందే. స్టైలిష్, మాస్, కామిక్ టైమింగ్‌తో కోట్లాది మంది ఫాలోవర్లు సంపాదించుకున్నాడు విజయ్. ఈ టాప్ హీరోకు సంబంధించిన వార్త ఒకటి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. దళపతి విజయ్ వన్ మ్యాన్ ఆర్మీలా 2023లో కోలీవుడ్ బాక్సాఫీస్ మోత మోగించాడు.

ఈ ఏడాది గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద విజయ్ సినిమాలైన లియో, వారిసు 900 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టాయి. ఈ రెండు సినిమాలు 2023 కోలీవుడ్ టర్నోవర్‌లో 25 శాతానికిపైగా రాబట్టాయంటే విజయ్ క్రేజ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ వార్తను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు అభిమానులు. కాగా విజయ్ ప్రస్తుతం దళపతి 68లో నటిస్తున్నాడు. వెంకట్ ప్రభు (%ఎవఅఞ్‌ాతీఖఎష్ట్రబ%) దర్శకత్వంలో వస్తున్న ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా, యోగిబాబు మిక్ మోహన్, జయరాం ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీ నుంచి డిసెంబర్ 31న టైటిల్, ఫస్ట్ లుక్‌తోపాటు జనవరి 1న సెకండ్ పోస్టర్ రానుందని కోలీవుడ్ సర్కిల్ సమాచారం. ఈ చిత్రంలో తెలుగు, తమిళం, కన్నడతోపాటు పాన్ ఇండియా స్థాయిలో పాపులారిటీ సంపాదించుకున్న కిచ్చా సుదీప్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో పాన్ ఇండియా కథాంశంతో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నాడు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com